
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 13 సెప్టెంబరు 2025



నిజంగా 'ఉపకార' వేతనమే!



- ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభే ప్రామాణికం
- విద్యార్థుల చదువులకు ఆర్థికంగా తోడ్పాటు
- ఏడాదికి రూ.12వేల చొప్పున సాయం
- ఈ నెల 16 వరకు దరఖాస్తుకు అవకాశం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అర్హులు

6లో

● గత నెలలో జలుమూరు మం డలం కూర్మనాథపురానికి చెందిన ఒక రైతు ఒక్కసారిగా కళ్లు తిరిగి మూర్ఛపోయాడు. కుటుంబ సభ్యులు నరసన్నపేట మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజులపాటు చికిత్స అందజేయగా.. ఓవర్‌డోస్ మందులు ఇవ్వడంతో కిడ్నీ మీద ప్రభావం పడి సోడియం లెవెల్స్ పెరిగాయి. దీంతో ఆ రైతును శ్రీకాకుళంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ 15 రోజులపాటు చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డాడు.

● ఇటీవల గుంటూరు జిల్లా తూరకపాలెంలో వరుస మరణాలు సంభవించాయి. గ్రామంలో జ్వరాల బారిన పడినవారికి ఆర్ఎంపీ వైద్యుడు కల్తీ సెలైన్ ఎక్కించడంతోనే పలువురు మృతి చెందినట్టు వైద్యపరిశోధకులు నిర్ధారించారు.

● తాజాగా గురువారం భామిని మండలం ఘనసర గ్రామానికి చెందిన తేజాలమ్మ తన భర్త సూర్యనారాయణతో కలిసి కొత్తూరులో పీఎంపీ నాగేశ్వరరావు నిర్వహిస్తున్న ప్రైవేటు క్లినిక్‌కు వెళ్లింది. కాళ్లు పీకులు, నొప్పులుగా ఉన్నాయని చెప్పింది. నాగేశ్వరరావుకు ఆమెకు ఇంజక్షన్ ఇవ్వగా డోస్ ఎక్కువై.. భర్త కళ్లముందే ప్రాణాలు కోల్పోయింది.

● నరసన్నపేట పట్టణంలో ఓ వ్యక్తి.. ఎటువంటి వైద్యవిద్య చదవలేదు. కానీ విరిగిన కాళ్లు, చేతులకు చికిత్స చేస్తున్నారు. కొంతమందికి నయమవుతుంది. కానీ చాలామంది ఆయన వైద్యం కారణంగా అంగవైకల్యం బారిన పడ్డారు.

● కొన్ని రోజుల కిందట సారవకోట మండలం ఒక గ్రామంలో ఓ వ్యక్తి ఆయాసంతోపాటు చెమట పడుతుండోందని ఓ ఆర్ఎంపీ వద్దకు వెళ్లాడు. ఆయన సెలైన్ బాటిల్ పెట్టి.. చికిత్స అందజేశాడు. ఆ వ్యక్తి ఆరోగ్యం మరింత క్షీణించడంతో వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయనకు గుండెకు సంబంధించిన సమస్య ఉందని, కొంచెం ఆలస్యమైతే చనిపోయేవాడని వైద్యులు తెలిపారు.

చంపేస్తున్నారు!





- రోగుల ప్రాణాలతో చెలగాటం
- పీఎంపీ, ఆర్ఎంపీల వద్దే అన్నీ..
- మోతాదుకు మించి వైద్యం
- చోద్యం చూస్తున్న అధికారులు

నరసన్నపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి)

..ఇలా జిల్లాలోని చాలా గ్రామాల్లో కొంతమంది ఆర్ఎంపీలు, పీఎంపీలు క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. శంకర్ దాదా ఎంబీబీఎస్ సినిమాలో హీరో మాదిరి.. తమకు వైద్యం గురించి పూర్తిగా తెలియకపోయినా డాక్టర్ల అవతారమెత్తుతున్నారు. మందులివ్వడమే కాదు.. ఆపరేషన్లు సైతం చేసేస్తున్నారు. పట్టణాల్లో పెద్దాసుపత్రికి వెళితే ఖర్చు భరించలేమన్న కారణంతో చాలామంది పేదలు మెకాళ్ల, కీళ్ల నొప్పులు, జ్వరాలతో బాధపడుతూ.. గ్రామాల్లో ఆర్ఎంపీలను ఆశ్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో కొందరు ఆర్ఎంపీలు ధనార్జనే ధ్యేయంగా వైద్యం చేస్తున్నారు. ప్రథమ చికిత్స అందించాల్సిన వీరు ఏకంగా ప్రత్యేక భవనాల్లో పడకలు ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందజేస్తున్నారు. కొన్నిచోట్ల క్లినిక్, మందుల దుకాణం.. అన్నీ ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. ఇంకొందరు అనుమతులు లేకుండానే మందులషాపులు, ల్యాబ్‌లు కూడా నిర్వహిస్తున్నారు. ఇష్టానుసారంగా రక్త, మూత్ర పరీక్షలు చేస్తున్నారు. మరి కొందరైతే మెడికల్ దుకాణాల్లోనే అన్ని రకాల వైద్య చికిత్సలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా..

నిబంధనల మేరకు ఆర్ఎంపీలు ప్రథమచికిత్స మాత్రమే చేయాలి. ఎలాంటి ఇంజక్షన్లు ఇవ్వకూడదు. ఎవరైనా జ్వరంతో బాధపడుతూ వస్తే సాధారణ మాత్రలే ఇవ్వాలి. తీవ్రత ఎక్కువగా ఉంటే సమీపంలోనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సిఫారసు చేయాలి. కానీ కొందరు ఆర్ఎంపీలు తమ పరిధి దాటి చికిత్సలు చేస్తున్నారు. ప్రతీ సమస్యకు ఇంజక్షన్ ఇచ్చేస్తున్నారు. ఎక్కువ మోతాదులో యాంటీబయోటిక్స్, స్టిరాయిడ్స్ వంటివి సూచిస్తున్నారు. కొన్నిరకాల పెయిన్ కిల్లర్లు ఇస్తున్నారు. వీటివల్ల రోగనిరోధక శక్తిపై ప్రభావం చూపుతోంది. కొంతమంది రోగులకు కిడ్నీలు కూడా పాడైపోతున్నాయి.

గర్భిణులు, చిన్న పిల్లలకు ఎలాంటి చికిత్స చేయకూడదు. ఫార్మసీ సర్టిఫికెట్లు దగ్గర ఉంచుకుని మందుల దుకాణాలు నిర్వహించడం కూడా నిబంధనకు విరుద్ధమే. ఇలాంటివాటిపై పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లాలోని గిరిజన, మారుమూల (మిగతా 6వ పేజీలో..)

చిట్‌ఫండ్ మోసానికి చెక్

- నిందితురాలి ఆస్తుల జప్తు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- సీఐడీ విచారణ నివేదిక ఆధారంగా చర్యలు

శ్రీకాకుళం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదేళ్ల కిందట భారీ చిట్‌ఫండ్ మోసం వెలుగులోకి వచ్చింది. రణస్థలం మండలం పైడిభీమవరం గ్రామానికి చెందిన లింగం నీలవేణి చిట్‌ఫండ్స్ పేరుతో వందలాది మంది నుంచి డిపాజిటర్లను మోసం చేసి రూ.కోట్లు దోచుకుందని అప్పటి పోలీసుల దర్యాప్తులో తేలింది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటానికి ఆమె సొంతం చేసుకున్న స్థిరాస్తులను ప్రభుత్వం జప్తు చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. కొన్నేళ్ల కిందట సీతారామయ్య భార్య లింగం నీలవేణి(37).. రణస్థలం మండలం పైడిభీమరంలో అక్రమంగా ప్రైవేట్ చిట్‌ఫండ్ వ్యాపారం చేసింది. ఏజెంట్ల ద్వారా 276మంది డిపాజిటర్ల నుంచి చందాలు, డిపాజిట్లు సేకరించింది. మూలధనం, ఆశించిన లాభాలు తిరిగి కస్టమర్లకు చెల్లించలేదు. దీనిపై (మిగతా 6వ పేజీలో..)

● తాత్కాలిక జప్తు ఆదేశాలు..

సీఐడీ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా.. నిందితురాలి ఆస్తులను విక్రయించే అవకాశం ఉందని ప్రభుత్వం గుర్తించింది. అందుకే హోంశాఖ జీవో ఎంఎస్ 133 ద్వారా తాత్కాలిక జప్తు ఆదేశాలు జారీచేసింది. అలాగే సీఐడీ డైరెక్టర్ జనరల్‌ను కంపీటెంట్ అథారిటీగా నియమించింది. ఆస్తులను కోర్టు ఆదేశాల ప్రకారం పూర్తిగా జప్తుచేసేందుకు సీఐడీకి అధికారాలు ఇచ్చింది. అనంతరం న్యాయపరమైన ప్రక్రియను పూర్తిచేయాలని సూచించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలతో డిపాజిటర్లకు కొంత భరోసా లభించింది. నిందితురాలు సొంతం చేసుకున్న ఆస్తులను జప్తు చేసి వాటిని బాధితుల నష్టపరిహారానికి ఉపయోగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



గ్రామకంఠం స్థలం గేటుకు తాళం వేస్తున్న చిగురువలస యువకులు

గ్రామకంఠం భూమిని అమ్మేస్తారా?

- చిగురువలస యువకుల నిరసన
- 'సరుబుజ్జిలి'లో యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల విక్రయాలు
- అధికారుల తీరుపై విమర్శలు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలం చిగురువలస పంచాయతీలో గ్రామకంఠం భూమి విక్రయంపై స్థానిక యువకులు నిరసన తెలిపారు. మండలంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ భూములను ఆక్రమించి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో పేర్లను తారుమారు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొంతమంది రెవెన్యూ అధికారులు వీరికి సహకరిస్తూ.. డీపట్టాలు మంజూరు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటవీ భూములు, ప్రభుత్వ భూములు, గ్రామకంఠం ఏ భూమి అయినా అడ్డంకులు లేకుండా విక్రయించుకునేలా అక్రమార్కులకు తోడ్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. సరుబుజ్జిలి, శరభాపురం, నందికొండ, వెన్నెలవలస, లక్ష్మీపురం, తాడికొండ, శ్రీరాంపురం, చిగురువలస, మర్రిపాడు, అమృత లింగానగరం, ఒప్పంగి రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవల చిగురువలస పంచాయతీ శ్రీరామవలస రెవెన్యూ గ్రామానికి చెందిన 9-1, 9-3 సర్వే నెంబర్లలో సుమారు ఒక ఎకరా 60సెంట్లు గ్రామకంఠం ప్రభుత్వ భూమిని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఒక వ్యక్తికి ఎవరో ఒక వ్యక్తి విక్రయించినట్టు చిగురువలసకు చెందిన యువకులకు తెలిసింది. కొనుగోలు చేసిన వ్యక్తి గురువారం యంత్రాలతో ఈ స్థలాన్ని చదును చేశారు. కాగా రూ.కోట్ల విలువ (మిగతా 6వ పేజీలో..)

ఆర్థిక పరిస్థితి బాగాలేక..
గంజాయి స్మగ్లర్లుగా మారి..

- 40 కిలోలతో రైల్వేపోలీసులకు పట్టుబడిన దంపతులు
- నిందితులు బీహార్ వాసులు.. ఆరునెలల క్రితం వివాహం

పలాస, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రానికి చెందిన వారిద్దరికీ ఆరు నెలల కిందట పెళ్లయింది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో ఓ బ్రోకర్ ఇచ్చిన సలహాతో ఆ దంపతులిద్దరూ గంజాయి స్మగ్లర్లుగా మారారు. చివరికి 40 కిలోల గంజాయి (మిగతా 6వ పేజీలో..)



పట్టుబడిన నిందితులు, గంజాయితో పలాస రైల్వే పోలీసులు

గంజాయి నిర్మూలనకు స్పష్టమైన కార్యాచరణ

● రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి



రేంజ్ ఎస్పీలతో సమీక్షిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

విశాఖపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీలో పూర్తిగా గంజాయి నిర్మూలనకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలుచేయాలని రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. శుక్రవారం రేంజ్ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని జిల్లాల ఎస్పీలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు 14మంది నిందితుల నుంచి రూ.10.04 కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకోవడం అభినందనీయం. ఇంకా 1,119 మంది గంజాయి నిందితులపై షీట్లు తెరవడం, 51 మందిపై పీడీ యాక్టు, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుచేయడానికి ప్రతిపాదించాం. తరచుగా గంజాయి రవాణాచేసే 368మంది, ఇతర నేరాలతో సంబంధం ఉన్న 370 మందిని గుర్తించాం. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల ఆధారంగా 341 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచాం. ఈ ఏడాది ఇప్పటివరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయి. వీరిలో 24 మందికి 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్షలు ఖరారయ్యాయ'ని తెలిపారు. రేంజ్ పరిధిలో టెక్నాలజీ వినియోగించి పరారీలో ఉన్న నిందితుల్ని పట్టుకున్న అధికారులను అభినందించారు. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా గంజాయి రవాణా మార్గాలను అధ్యయనంచేసి అరికట్టాలని సూచించారు. స్త్రీలు, చిన్న పిల్లలపై లైంగిక నేరాలు, తప్పిపోయిన మహిళలు, బాలికల కేసులపై వేగవంతంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు అధిగమించడానికి కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలన్నారు. సమీక్షలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్ జిందాల్, తుహిన్ సిన్హా, అమిత్‌బర్దార్ పాల్గొన్నారు.

స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

● డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్త్రీల ఆరోగ్య సమస్యలపై అవగాహన, పరీక్షలు, చికిత్స ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని డీఎంహెచ్‌వో డా.కె.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ మందిరాలు (హెల్త్ క్లినిక్‌లు), ప్రాథమిక, పట్టణ, సామాజిక, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, జిల్లావైద్య కళాశాల ఆసుపత్రుల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో వైద్య శిబిరాలు నిర్వహిస్తాం. ఎన్‌సీడీ, క్యాన్సర్, రక్తహీనత, టీబీ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లీబిడ్డల రక్షణ, ఇమ్యునైజేషన్, ఋతు పరిశుభ్రత, ఏబీపీఎంజేఏవై, పోషన్, రక్తదానం, హెల్త్ టెక్ స్టార్టప్‌లు, ఆయుష్ సేవలు, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ కేన్సర్, మొదలగు పరీక్షలు, చికిత్సలు అందజేస్తాం. గర్భధారణ సమయంలో పౌష్టికాహారం, సంరక్షణపై అవగాహన కల్పిస్తాం. పిల్లలకు రోగ నిరోధక సేవలు అందిస్తాం. ఆయుష్మాన్ వందన కార్డు, నిక్షయ్ మిత్ర వలంటీర్ల నమోదు వంటి సేవలను అందుబాటులో ఉంచుతాం. ఈ సేవలను వినియోగించుకోవాల'ని డీఎంహెచ్‌వో తెలిపారు.

శ్రీకూర్మం ట్రస్టుబోర్డు సభ్యుల నియామకం

6లో



ఇచ్ఛాపురం మునిసిపాలిటీ కార్యాలయం

రోజంతా ప్రయాణమే!

- జిల్లాకేంద్రం శ్రీకాకుళం వెళ్లాలంటే ఎన్నో ఇక్కట్లు
- ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలకు వ్యయప్రయాసలు
- పలాసను జిల్లాగా ఏర్పాటు చేస్తే తీరనున్న కష్టాలు
- మంత్రుల కమిటీకి వినతులిచ్చేందుకు సిద్ధం

● శ్రీకాకుళం జిల్లాకేంద్రంలోని జడ్పీలో 'మీ కోసం (గ్రీవెన్స్)' కార్యక్రమానికి గతంలో వెళ్లాను. ఆ రోజు ఉదయం 4గంటలకు లేచి ఐదు గంటలకు బస్సులో బయలుదేరితే శ్రీకాకుళం చేరేసరికి 9 గంటలైంది. గ్రీవెన్స్ పని ముగించుకొని మధ్యాహ్నం 1 గంటకు అక్కడ బయలుదేరితే సాయంత్రం ఆరు గంటలకు చేరుకున్నాను. రోజంతా కేటాయించడంతో ఇతర పనులు మానుకోవాల్సి వచ్చింది.

-ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీనివాస్ ఆవేదన ఇది

● జిల్లాకేంద్రంలో ఇటీవల ఓ సమావేశానికి విధిగా హాజరుకావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అక్కడ సమావేశం జరిగింది రెండు గంటలే కానీ.. రానూపోను ప్రయాణం ఆరు గంటలు పట్టింది. దీంతో సమయం చాలా వృథా అయ్యింది. ఆ ప్రభావం ఇతర శాఖాపరమైన పనులపై పడింది.

-ఇచ్ఛాపురంలోని ఓ అధికారి ఆవేదన ఇది

● గతంలో వెహికల్ ఫిట్‌నెస్‌కు సంబంధించి స్థానిక కార్యాలయంలో నిర్ధారించేవారు. కానీ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో దానిని జిల్లా కేంద్రానికే పరిమితం చేశారు. వారు నిర్దేశించిన ప్రకారం వాహనాల సామర్థ్య పరీక్ష అక్కడే నిర్వహించాలి. దీంతో రానూపోనూ 250 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వచ్చింది.

-ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దక్కత శ్రీరాం ఆవేదన ఇది

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి)

పౌరసేవలు, శాఖపరమైన పనుల కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడుతున్నారు. అనారోగ్య, అత్యవసర పరిస్థితులైతే ఎక్కువగా ఈ నియోజకవర్గ ప్రజలు ఒడిశా రాష్ట్రంలోని బరంపూర్, భువనేశ్వర్‌కు వెళ్తారు. కలెక్టరేట్‌కు, జడ్పీకి, జిల్లాపరమైన పనులకు మాత్రం తప్పకుండా శ్రీకాకుళం వెళ్లాల్సిందే. కాగా.. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వెళ్లాలంటే 126 కిలోమీటర్లు ప్రయాణించాలి. అంటే రానూపోనూ 250కిలోమీటర్లు పైమాటే. శ్రీకాకుళం వెళ్లాలంటే రోజంతా ప్రయాణించాల్సి వస్తోందని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జిల్లాకేంద్రం సుదూరం కావడంతో పలాసను కొత్త జిల్లాగా ప్రకటిస్తారని.. అందులో ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని చేర్చుతారనే ప్రచారం సాగుతోంది. జిల్లాల ఏర్పాటు, డివిజన్, మండలాల చేర్పులు, మార్పులకు అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం మంత్రులతో కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ అభిప్రాయాలను సేకరించనుంది. దీంతో ఇచ్ఛాపురం ప్రజలు పలాస జిల్లా ఏర్పాటు చేయాలని, అందులో తమ నియోజకవర్గాన్ని కలపాలని కోరుతున్నారు.

● పలాస జిల్లా అయితే..

ఒడిశా నుంచి వచ్చేటప్పుడు ఇచ్ఛాపురం నియోజకవర్గం మొట్టమొదటిగా ఉంటుంది. అందుకే ఇచ్ఛాపురం పట్టణాన్ని ఈశాన్య ముఖద్వారంగా పిలుస్తారు. ఈ నియోజకవర్గంలో ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట మండలాలు ఉన్నాయి. ఇక్కడి ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడతారు. కొబ్బరితోటల సాగుతోపాటు వరి పండిస్తారు. మహేంద్రతనయా, బాహుదా నదులు ఉన్నా.. ఒడిశా ఎగువ ప్రాంతాల్లో ప్రాజెక్టుల ఏర్పాటుతో ఇక్కడ నీటి లభ్యత లేదు. మత్స్యకారులతోపాటు చిన్న సన్నకారు రైతులు ఎక్కువ మంది ప్రత్యామ్నాయ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. అందుకే తలసరి ఆదాయంలో కూడా ఈ నియోజకవర్గం వెనుకబడి ఉంది. ఈ నేపథ్యంలో పలాస జిల్లాలో ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని చేర్చి మౌలిక వసతుల కల్పనతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచితే ప్రయోజనం ఉంటుంది.

● పలాసను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటుచేస్తే ఇచ్ఛాపురానికి దూరభారం తగ్గుతుంది. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా కేంద్రం 126 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. పలాస అయితే కేవలం 48 కిలోమీటర్లే. దీంతో ప్రజల రవాణా (మిగతా 6వ పేజీలో..)

మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వండి

- సుర్జిని, బాణాపురం గ్రామస్థుల వినతి
- మీరు చెప్పిందే తెలియజేస్తాం: ఆర్డీవో కృష్ణమూర్తి
- క్వారీ పనులపై ప్రజాభిప్రాయ సేకరణ

6లో

ప్రచారానికీ హద్దులు

- ఫ్లెక్సీలు, హోర్డింగులకు అనుమతి తప్పనిసరి
- వీటి కోసం ప్రత్యేక ఏజెన్సీల నియామకం
- తద్వారా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆదాయం

టెక్కలిలో రహదారి ఇక్కట్లు

- ఆక్రమణలకు గురవుతున్న పాత జాతీయ రహదారి
- పట్టించుకోని అధికారులు
- వాహనాల రాకపోకలకు ఇబ్బంది

8లో

జాతీయస్థాయిలో ప్రతిభ చూపండి

- డిప్యూటీ డీఈవో విజయకుమారి
- ముగిసిన కళాఉత్సవ్

6లో

ప్రచారానికీ హద్దులు



పాతపట్నం సమీపంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో ఉన్న ఫ్లెక్సీ

- ఫ్లెక్సీలు, హోర్డింగులకు అనుమతి తప్పనిసరి
- వీటి కోసం ప్రత్యేక ఏజెన్సీల నియామకం
- తద్వారా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఆదాయం

పుట్టిన రోజుకు ఫ్లెక్సీ.. వివాహాలకు ఫ్లెక్సీ.. పదవులొస్తే ఫ్లెక్సీ.. నాయకులొస్తే ఫ్లెక్సీ.. రాజకీయ పార్టీ సభలు జరిగినా ఫ్లెక్సీ.. చివరికి మరణించినా ఫ్లెక్సీ. ఈ ఫ్లెక్సీల సంస్కృతి నగరాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించింది. అనేక చోట్ల ఇవి ప్రమాదకరంగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు ప్రభుత్వం వీటికి చెక్ పెట్టే దిశగా అడుగులు వేస్తోంది.

పాతపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):

ఫ్లెక్సీలు, హోర్డింగులను ఎక్కడ పడితే అక్కడ పెడతామంటే ఇకపై కుదరదు. వీటికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం కఠినతరం చేస్తోంది. పల్లెల నుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు, హోర్డింగులు కనిపిస్తున్నాయి. వీటి కారణంగా పెరుగుతున్న ప్రమాదాలు.. ప్రజల ఆవేదనలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్పందించింది. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను అనుమతి లేకుండా ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేసింది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అనుమతులు పొంది... లైసెన్స్ కలిగిన ఏజెన్సీల ద్వారా మాత్రమే ప్రచారం చేసుకోవాలని ఆదేశించింది. ఈ దిశగా స్థానిక సంస్థలకూ తగు సూచనలిచ్చింది. ఈ ఆదేశాల అమలుకు సంబంధిత అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఆంక్షలతో ఆదాయం..

నగర పాలక సంస్థలు, పురపాలక సంఘాల పరిధిలో ఇకపై ఎక్కడ పడితే అక్కడ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయడానికి వీలులేదు. ఇలా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పురపాలక శాఖకు ఆదేశాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా హోర్డింగుల ఏర్పాటు సమస్యాత్మకంగా మారింది. నగరాలు, పట్టణాలలోని ప్రధాన కూడలి ప్రాంతాలతో పాటు రహదారి మధ్యలో డివైడర్లపైన సైతం ప్రకటనలకు అనుమతులిస్తూ మున్సిపాలిటీలు తీసుకొనే సొంత నిర్ణయాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం నిర్ణీత ప్రాంతాలలో మున్సిపల్, నగర పాలక సంస్థల అనుమతితోనే ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి ఆయా సంస్థలు నిర్ణీత రుసుం వసూలు చేయనున్నాయి. తద్వారా వీటికి ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా..

- ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల ఏర్పాటుకు ఏజెన్సీల నుంచి ఫీజు వసూలు చేయాల్సి ఉంది.
- సంబంధిత ఏజెన్సీలు మున్సిపాలిటీ, కార్పొరేషన్ సంస్థల నుంచి విధిగా లైసెన్స్ పొంది ఉండాలి.
- అక్రమంగా, అభ్యంతరకరమైన ప్రాంతాలలో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే తొలగింపునకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తారు.
- వీటి ఏర్పాటుపై మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంటుంది.

నాడు టీడీపీ హయాంలో ఎలాగంటే..

2016 డిసెంబరు 1 నుంచి ఫ్లెక్సీలను నిషేధిస్తూ టీడీపీ ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్లెక్సీల ఏర్పాటు ఇష్టారాజ్యమైపోయింది. ఎక్కడికక్కడ ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు వెలుస్తున్నా అధికార యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరించింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా దీనిపై పెద్దగా దృష్టి సారించలేదు. తాజాగా హైకోర్టు దీనిపై సీరియస్‌గా దృషి సారించింది. ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు, హోర్డింగులు ఏర్పాటు చేయకూడదని ఆదేశించింది. మున్సిపల్ అధికారులు మంజూరు చేసిన లైసెన్స్ కలిగిన ఏజెన్సీల ద్వారా మాత్రమే ప్రచారాలు చేసుకోవాలని ఆదేశించడంతో ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.


చల్లవానిపేట కూడలిలో శునకాల గుంపు

బాబోయ్ కుక్కలు..

జలుమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కుక్కల స్వైర విహారం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఈ చిత్రమే నిదర్శనం. ఒకటో... రెండో కాదు... ఇలా పదుల సంఖ్యలో ఒక చోట చేరుతున్నాయి. ఆ సమయంలో అటు వైపుగా పాదచారులో... ద్విచక్ర వాహన చోదకులో వెళితే... వెంటపడి దాడి చేస్తున్నాయి. వీటి నుంచి తప్పించుకునే క్రమంలో నిత్యం అనేక మంది వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రయాణమంటేనే భయపడే పరిస్థితులు ఉంటున్నాయి. సాయంత్రం ఆరు గంటలు దాటితే రోడ్లపై వెళ్లడానికే జనం భీతిల్లుతున్నారు. మాంసం దుకాణాలు, రోడ్ల పక్కన ఉంటున్న దాబాలు, హోటళ్ల వద్ద పెద్ద సంఖ్యలో కుక్కలు ఉంటున్నాయి. అటువైపుగా వెళ్లే వారిపై గుంపులుగా దాడి చేస్తున్నాయి. పశువులశాలల్లో కడుతున్న లేగదూడలపైన కూడా దాడి చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నిజంగా ఉపకార వేతనమే!

- ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో ప్రతిభే ప్రామాణికం
- విద్యార్థుల చదువులకు ఆర్థికంగా తోడ్పాటు
- ఏడాదికి రూ.12వేల చొప్పున సాయం
- ఈ నెల 16 వరకు దరఖాస్తుకు అవకాశం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అర్హులు


ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నరసన్నపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి.. భవిష్యత్తులో మంచిగా స్థిరపడాలని తల్లిదండ్రులు కలలు కంటారు. పేదరికం కారణంగా వారి ఆశలు అడియాశలవుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి చదివించే స్థోమత చాలా మందికి లేకపోవడంతో చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ఈ దుస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2008లో పేద పిల్లల కోసం నేషనల్ మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఎనిమిదో తరగతి చదివే పిల్లలకు ఏటా పరీక్ష నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచే వారికి నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు.

అర్హులు ఎవరంటే...

ప్రభుత్వ జిల్లా పరిషత్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాయడానికి అర్హులు. వీరు ఆరు, ఏడు తరగతుల్లో 50శాతం మార్కులు సాధించి ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో విద్యార్థులు చదువుతుండాలి. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో చదివే వారు అనర్హులు, అలాగే ప్రైవేటు పాఠశాలల్లో చదివేవారు కూడా అనర్హులు.

పరీక్ష విధానం ఇలా..

పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 3 గంటల వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. పరీక్షలో ప్రతిభ చూపిన వారిని స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తారు.

ఏడాదికి రూ.12 వేలు

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్ షిప్ అందుతుంది. నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. చదువుకోవాలనే పట్టుదల ఉండి... పేదరికం... ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

దరఖాస్తు ఇలా..

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ కోసం 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ప్రక్రియ ఆగస్టు 7న ప్రారంభమైంది. ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుంగా రూ.100 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలి. పరీక్షా రుసుం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది.

సద్వినియోగం చేసుకోండి..

ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులు ఉపకార వేతనం పొందడానికి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పథకం మంచి అవకాశం. ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థీ దరఖాస్తు చేసుకోవచ్చు. నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేటు పాఠశాలల్లో చదివేవారు అనర్హులు.

-పేడాడ దాలినాయుడు, ఎంఈవో, నరసన్నపేట

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపండి

- డిప్యూటీ డీఈవో విజయకుమారి
- ముగిసిన కళాఉత్సవ్


చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న డిప్యూటీ డీఈవో

గార, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి.. జిల్లాకు గుర్తింపు తీసుకు రావాలని ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి అన్నారు. వమరవెల్లి డైట్‌లో జిల్లా స్థాయిలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళా ఉత్సవ్ శుక్రవారం ముగిసింది. ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రదర్శనలో విజేతలకు శుక్రవారం సాయంత్రం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిప్యూటీ డీఈవో విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి... వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కళాఉత్సవ్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. చదువుతో పాటు విద్యార్థులకు కళల్లోనూ ప్రవేశం ఉండాలన్నారు. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి ప్రోత్సాహం అవసరమని సూచించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎ.గౌరీశంకరరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వివిధ కళా రూపాల్లో ప్రథమ బహుమతులు పొందిన 12 మంది విజేతలను వచ్చే నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు తెలిపారు. అక్కడ కూడా మంచి బహుమతులు పొందితే జాతీయ స్థాయికి పంపిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతులు పొందిన విద్యార్థులకు డిప్యూటీ డీఈవో, డైట్ ప్రిన్సిపాల్ బహుమతులు అందించారు.

చంపేస్తున్నారు!

(ఐదో పేజీ తరువాయి)

ప్రాంతాల్లో డమ్మీ చేతి సంచి డాక్టర్ల వ్యవహారంతో చాలామంది ప్రాణాలు పైకిపోతున్నాయి. ఆర్ఎంపీలు చేసే ఇంజక్షన్లు వికటించిన సందర్భాలు ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉన్నాయి. మోతాదుకు మించి మందులు ఇవ్వడంతో కొంతమంది అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఆర్ఎంపీలు, పీఎంపీలు రోగులకు ఇంజక్షన్లు, సెలైన్ ఎక్కించరాదు. వారి వద్దకు వచ్చే రోగులకు ప్రథమచికిత్స చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సిఫారసు చేయాలి. శస్త్రచికిత్సలు, కీళ్లు విరిగితే కట్లు వేయడం చేయరాదు. ఇలాంటి వారిపై ఫిర్యాదులు వస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

-డా.అనిత, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి, శ్రీకాకుళం

రోజంతా ప్రయాణమే!

(ఐదో పేజీ తరువాయి)

కష్టాలు సైతం తొలగుతాయి. గతంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని అన్ని మండలాలు టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో ఉండేవి. అప్పట్లో ప్రజలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఏదైనా పనిపై టెక్కలి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురయ్యారు. పలాస డివిజన్ చేయడంతో కొంత ఉపశమనం దక్కింది. ఇప్పుడు పలాసను ప్రత్యేక జిల్లాగా ప్రకటిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు ఆశిస్తున్నారు. ఈ విషయంపై కేబినెట్ సబ్ కమిటీ ఆలోచించాలని కోరుతూ వినతిపత్రాలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

పలాస జిల్లాను ఏర్పాటు చేయాలి



శ్రీకాకుళం జిల్లావాసులుగా ఎంతగానో ఆనందపడుతుంటాం. కానీ ఇచ్ఛాపురం నియోజకవర్గ వాసిగా మాత్రం బాధపడుతుంటాం. ఎందుకంటే జిల్లా కేంద్రం 126 కిలో మీటర్ల దూరంలో ఉండడం బాధాకరం. ప్రజలు ఎంతో వ్యయప్రయా సలకు గురవుతుంటారు. అందుకే పలాస జిల్లాను ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ ఉలాల కోదండరామ్, ప్రముఖ వైద్యుడు, ఇచ్ఛాపురం

ఒడిశాతోనే అనుబంధం



శ్రీకాకుళం జిల్లా కేంద్రం కంటే ఒడిశా వెళ్లడం చాలా సులువు. పక్కన ఉన్న గంజాం జిల్లా కేంద్రం బరంపురం అరగంటలో వెళ్లిపోవచ్చు. కేవలం ప్రభుత్వపరమైన పౌరసేవలు, సంక్షేమ పథకాలు, శాఖాపరమైన పనులకు వ్యయప్రయాసలకోర్చి శ్రీకాకుళం వెళుతుంటారు. అందుకే పలాస జిల్లాను తక్షణం ప్రకటించాలి.

-చాట్ల తులసీదాస్‌రెడ్డి, వెంకటరామలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

చిట్‌ఫండ్ మోసానికి చెక్

(ఐదో పేజీ తరువాయి)

2020 నవంబరులో పైడిభీమవరం గ్రామానికి చెందిన సగరం నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసు స్టేషన్‌లో క్రైం నంబర్ 711/2020 కింద 406, 420 ఐపీసీ, చిట్‌ఫండ చట్టం 76వ సెక్షన్, ఏపీపీడీఎఫ్ఈ చట్టం 5వ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. మొత్తం ఆమె రూ.3.45 కోట్లు సొంతం చేసుకుందని పోలీసు దర్యాప్తులో బయటపడింది. తరువాత ఈ కేసు సీఐడీకి బదిలీ అయింది. విచారణలో డిపాజిటర్ల డబ్బుతో నీలవేణి అనేక స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు రుజువైంది. విజయనగరం జిల్లా డెంకాడ మండలం పెద్దతాడివాడలో 214 చదరపు గజాల ప్లాట్, అదే ప్రాంగణంలో నిర్మించిన 'మహాలక్ష్మి టవర్స్'లో 35.66 చదరపు గజాల విస్తీర్ణం గల ప్లాట్లు, శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం సీతంవలసలో 183.26 చదరపు గజాల ఖాళీస్థలం... ఇవన్నీ పలువురి పేర్లతో ఆమె కొనుగోలు చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

● ఇదో పెద్ద హెచ్చరిక..

చిన్న గ్రామాల వరకు విస్తరిస్తున్న చిట్‌ఫండ్ మోసాలు ఎంత ప్రమాదకరమో ఈ సంఘటన మళ్లీ నిరూపించింది. న్యాయపరమైన చర్యలు వేగంగా జరిగితే మోసపోయినవారు తమ డబ్బును తిరిగి పొందే అవకాశాలు పెరుగుతాయి. ప్రజలు కూడా ఇలాంటి అనుమానాస్పద పథకాలలో డబ్బు పెట్టే ముందు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అన్నది పరిశీలించాలి. 'డిపాజిటర్ల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చిట్‌ఫండ్ మోసాలకు పెద్ద హెచ్చరిక అవుతుంది' అని సీఐడీ అధికారులు తెలిపారు.

గ్రామకంఠం భూమిని అమ్మేస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

చేసే గ్రామకంఠ స్థలాన్ని వేరే వ్యక్తులకు ఎలా విక్రయిస్తారంటూ యువకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఆ స్థలంలో ఉన్న ముఖద్వారం గేటుకు తాళాలు వేశారు. రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి గ్రామకంఠంతోపాటు ప్రభుత్వ భూములు విక్రయిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ ఎల్.మధుసూదన్ వద్ద ప్రస్తావించగా.. గ్రామ కంఠం స్థలం విక్రయించినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ఆ స్థలాన్ని పరిశీలించి బాధ్యుతలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్థిక పరిస్థితి బాగాలేక.. గంజాయి స్మగ్లర్లుగా మారి

(ఐదో పేజీ తరువాయి)

రవాణా చేస్తూ రైల్వే పలాస రైల్వే పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం రైల్వే సీఐ ఏ.రవికుమార్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 'బీహార్ రాష్ట్రం భోజ్‌పూర్ జిల్లా బిహయా గ్రామానికి చెందిన జూలి ప్రవీణ్, గాంధీనగర్‌కి చెందిన సాజద్ అన్సారిలు ఆరు నెలల కిందట వివాహం చేసుకున్నారు. వీరికి సరైన పనులు దొరక్క, కుటుంబ అవసరాలు తీరక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో కోల్‌కతాకు చెందిన ఓ గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఏర్పడింది. వీరి ఆర్థిక పరిస్థితిని ఆసరాగా చేసుకొని ఒడిశాలో ఓ అడ్రస్‌కు వెళితే గంజాయి ఇస్తారని, దాన్ని తీసుకుని తమకు అప్పగిస్తే ట్రిప్‌నకు రూ.10వేలు ఇస్తామని చెప్పడంతో దంపతులిద్దరూ అంగీకరించారు. వారు ఒడిశా రాష్ట్రం బరంపూర్‌లో రెండు రోజుల కిందట మకాం వేశారు. అనంతరం 40 కిలోల గంజాయిని మూడు బ్యాగుల్లో అమర్చి శుక్రవారం పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. రైల్వే ఫుట్‌బ్రిడ్జి వద్ద బ్యాగులతో వారిద్దరూ అనుమానస్పదస్థితిలో కనిపించడంతో ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.మాల్యాద్రి వారిని ప్రశ్నించారు. బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని, ఆ దంపతులను రైల్వే పోలీసులకు అప్పగించారు. వారిద్దరినీ ఎస్ఐ ఎం.మధుసూదనరావు అరెస్టు చేసి.. రైల్వేకోర్టులో హాజరుపరిచారని సీఐ రవి కుమార్ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా నిందితులను, గంజాయిని పట్టుకున్న ఆర్పీఎఫ్ ఎస్ఐను అభినందించారు. రైల్వేస్టేషన్‌లో ప్రతి రైలును తనిఖీ చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గంజాయి, మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. గంజాయి విక్రయించినా, రవాణా చేసినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ ఎం.మహాపాత్రో, సిబ్బంది ఉన్నారు.


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థుడు

మమ్మల్ని ప్రశాంతంగా బతకనివ్వండి

- సుర్జిని, బాణాపురం గ్రామస్థుల వినతి
- మీరు చెప్పిందే తెలియజేస్తాం:ఆర్డీవో
- క్వారీ పనులపై ప్రజాభిప్రాయ సేకరణ

మెళియాపుట్టి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'మా ఊళ్లలో.. మమ్మల్ని ప్రశాంతంగా బతనివ్వండి' అంటూ సుర్జిని, బాణాపురం గ్రామాల ప్రజలు టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం బాణాపురం పంచాయతీ పరిధిలో శ్రీశక్తి మూగాంబిక సంస్థ గ్రానైట్ పనుల నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామాల పరిధిలో ఇప్పటికే కొన్ని గ్రానైట్ కంపెనీలు పనులు చేస్తున్నాయని.. వీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. కొత్తది వద్దని అభ్యంతరం తెలిపారు. జాడుపల్లి నుంచి కొండల వరకు ఇరుకు రోడ్డు ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. రాత్రి వేళల్లో శబ్దాలకు గ్రామాల్లో ఉండలేకపోతున్నామని తెలిపారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ... సుమారు ఏడు హెక్టార్లలో 20 ఏళ్ల పాటు గ్రానైట్ పనులకు సంబంధిత సంస్థ దరఖాస్తు చేసుకుందని తెలిపారు. పరిశ్రమ వల్ల సుమారు 40 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. గ్రామాల్లో అబివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. రైతులు సహకరిస్తే ప్రభుత్వం నుంచి గానీ... గ్రానైట్ పరిశ్రమల వారితో గానీ మాట్లాడి, రెండు లైన్ల రహదారి నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. గ్రానైట్ పనులు మంజూరు చేయడం తమ చేతిలో లేదని తెలిపారు. ప్రజల అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆర్డీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.పాపారావు, జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మం ట్రస్టుబోర్డు సభ్యుల నియామకం

శ్రీకాకుళం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం గ్రామంలోని ప్రసిద్ధ శ్రీకూర్మనాథ స్వామి దేవస్థానానికి ట్రస్టు బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించింది. సాధారణ కేటగిరీ కింద ఒక సభ్యుని స్థానం ఖాళీగా ఉంచారు. కొత్తగా నియమితులైన బోర్డు సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ ఎక్స్-ఆఫీషియో సెక్రటరీ డా.ఎం. హరి జవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సభ్యులు వీరే..

పూసపాటి అశోక్ గజపతిరాజు	-	వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు
గుంట్రెడ్డి సంయుక్త	-	సభ్యురాలు
కైబడి కుసుమ కుమారి	-	సభ్యురాలు
పల్ల పెంటయ్య	-	సభ్యుడు
అంధవరపు మునీషా	-	సభ్యురాలు
ఆరవెల్లి శ్వేతబిందు	-	సభ్యురాలు
తన్ని సూరిబాబు	-	సభ్యుడు
మల్ల కల్యాణ చక్రవర్తి	-	సభ్యుడు
జమ్ము లక్ష్మి	-	సభ్యురాలు
చామర్ల సీతారామనృసింహాచార్యులు (అర్చకుడు)	-	ఎక్స్ అఫీషియో సభ్యుడు

నానో ఎరువులపై అవగాహన కలిగించాలి

● డీసీఎంఎస్ చైర్మన్ అవినాష్



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్

ఎచ్చెర్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): యూరియా వాడంతో నష్టాలను వివరించి నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కలిగించాలని డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ అన్నారు. కుశాలపురం పరిధి లోని ఓ ఫంక్షన్ హాల్‌లో వ్యవసాయ శాఖ, ఇఫ్కో సంయుక్త ఆధ్వర్యంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఎరువుల డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇఫ్కో సహకారంతో ఇప్పటి వరకు ఎరువుల పిచికారీకి 29 డ్రోన్లు అందుబాటులో ఉంచామన్నారు. నానో ఎరువులు, డ్రోన్లు వంటి నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రజని, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ, ఇఫ్కో స్టేట్ మేనేజర్ రాజు, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్లు రమణి, విమల, ఇఫ్కో మేనేజర్లు లోకేష్, జగదీష్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో..

సోంపేట రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొత్రఖండ, కర్తలిపాలెం సచివాలయాల పరిధిలో మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ టి.భవానీ శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు యూరియా వాడకంపై అవగాహన కలిగించారు. నానో ఎరువులను వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏవో బి.నరసింహమూర్తి, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి


ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

రణస్థలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో చదివిస్తున్నారని, వారి ఆశయాలను నెరవేర్చేలా కృషి చేయాలని ఆర్జేడీ ఆదినారాయణ అన్నారు. కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ప్రతిభ కనబరిచిన రేగిడి దుర్గాప్రసాద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీవీఈవో రేగాన సురేష్‌కుమార్, ఆర్ఐవో పి.దుర్గారావు, ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ సుధాకరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ సుధాకరరావు అన్నారు. స్థానిక మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశ మందిరంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఉల్లాస్'పై వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ శిక్షణ ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడం, వారికి సంఖ్యాశాస్త్రం, ఇతర జీవన నైపుణ్యా లను అందించాలన్నారు. వయోజన విద్య ఏడీ సోమేశ్వరరావు మాట్లాడుతూ.. 11,207 మంది వలంటీర్లకు శిక్షణ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చి, 1,12,000 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో చంద్రకుమారి, కె.వెంకట రమణ, పి.వెంకటరమణ, బాలచంద్ర, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రణభేరిని విజయవంతం చేయండి

ఆమదాలవలస, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి గొంటి గిరిధర్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని పలు పాఠశాలలను యూటీఎఫ్ ప్రతినిధులు శుక్రవారం సందర్శించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు పాపారావు, వెంకటరమణమూర్తి, శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక, విద్యారంగ సమస్యలపై రణభేరి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలపై ఈనెల 15న పలాసలో రణభేరి నిర్వహించనున్నామని, దీనిని విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పీఆర్‌సీని నియమించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడియా శ్రీను, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఈదుపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం తమ్మయ్య అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో మండలస్థాయి పాఠశాలల సమాఖ్య ఆధ్వర్యంలో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీల ఎంపిక నిర్వహించారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15, 16, 17 తేదీల్లో పలాసలో జరగనున్న డివిజన్‌స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జోన్-1 వ్యాయమోపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు కెపద్మనాభం రెడ్డి, పీఈటీలు ఊర్మిళ, వజీర్, గణేష్, శ్రీను, యాదవ్, రఘుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామసభ

గార, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శాలిహుండాంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఐఈసీ యాక్టివిటీలో భాగంగా సోషల్ మ్యాప్ ద్వారా ఉపాధి పనులపై సంబంధిత అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు గుండ భాస్కరరావు, ఉపాధి హామీ అధి కారులు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


సోంపేట: నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నేతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సీపీఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు అంతర్జాల పనులు, అనవసర యాప్‌లను పూర్తిస్థాయిలో తగ్గించాలని డిమాండ్ చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


కవిటి:తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు


కోటబొమ్మాళి: తహసీల్దార్‌కు వినతి..



హరిపురం/మందస: నినాదాలు చేస్తూ..


వజ్రపుకొత్తూరు: డీటీకి వినతిపత్రం ఇస్తూ..

ఖైనీ, గుట్కా ప్యాకెట్లు కాల్చివేత

జి.సిగడాం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గతంలో తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న గుట్కాలు, ఖైనీలను శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్ఐ వై.మధుసూదనరావు ఆధ్వర్యంలో తగులబెట్టారు. 8వేల ఖైనీ, గుట్కా ప్యాకెట్లను కాల్చినట్లు, వీటి విలువ సుమారు రూ.48 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు పి.జగన్నాథం, రాజశేఖర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధుడు ఏచూరి

రణస్థలం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసిన మహనీయుడు సీతారాం ఏచూరి అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. సీతారాం ఏచూ రి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి మూడు దశాబ్దాల పాటు చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్ సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): బాకర్ సాహెబ్‌పేట దుర్గా మహాలక్ష్మి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలను ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు తెన్నేటి సునీల్‌శర్మ తెలిపారు. అమ్మవారిని స్వర్ణకవచాలంకరణలో అమ్మవారిని అలంకరిస్తామని తెలిపారు. 23న బాలా త్రిపుర సుందరి దేవి, 24న గాయత్రీ దేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న లలితా దేవి, 27న కాత్యాయని, 28న మహాలక్ష్మి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి వచ్చే నెల 1న మహిషాసుర మర్దని, 2న రాజరాజేశ్వరిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

ఉత్సవ సంప్రదాయాలను పాటిద్దాం

శ్రీకాకుళం కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హిందూ సంప్రదాయాలు పాటిస్తూ గణేష్ ఉత్సవాలను నిర్వహిద్దామని ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.విష్ణుమూర్తి అన్నారు. శుక్రవారం 80 అడుగుల రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. తొలిసారిగా రాష్ట్రంలో ఉత్సవ సమితి ప్రారంభమైందని, దీనికి అనుబంధంగా జిల్లా కమిటీని కూడా ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు గొద్దు భాస్కరరావు తెలిపారు. రానున్న కాలంలో గణేష్ ఉత్సవ సమితి జిల్లా వ్యాప్తంగా పర్యటించి అందరూ కలిసి ఉత్సవాలు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బుర్రా ఆదినారాయణ శాస్త్రి, రమణమూర్తి, శ్రీరంగం మధుసూదనరావు, ఇప్పిలి హరి, గౌరీశంకర శాస్త్రి పాల్గొన్నారు.

సుపరిపాలనకే ప్రజాదర్బార్


వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలన అందించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రజాదర్బార్‌కి చర్యలు తీసుకున్నారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. నాలుగు మండలాల ప్రజలు పలు సమస్యలపై అర్జీలు అందించారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాయకులు హెచ్. నాగభూషణరావు, తమ్మినేని శ్రీనివాసరావు, రాజు, గోవిందరావు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం: అశోక్

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.70 కోట్లతో చేపట్టనున్న పలు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నిధులతో పలు వీధుల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. తద్వారా పట్టణం అభివృద్ధి చెందేందుకు అవకాశం కలుగు తుందన్నారు. పురుషోత్తపురం, కంద్రవీధి, నర్మదేశ్వర ఆలయం వీధి, బాసుదేవుపేట, రత్తకన్న, అచ్చంపేట తదితర కాలనీలు, వీధుల్లో పనులకు వర్షంలోనూ ఆయన పర్యటించి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్, చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, జనసేన ఇంచార్జి దాసరి రాజు, టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లీ యాదవ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య, నేతలు నందిగాం కోటి, రెయ్యి జానకిరావు, కొండా శంకర్‌రెడ్డి, ఎస్.శేఖర్, గిన్ని చిన్నా తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్‌పేటలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలి: శంకర్


శ్రీకాకుళం రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్/గారరూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విధులను చిత్తశుద్ధితో నిర్వహించి ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురం, గారల్లోని ప్రైవేట్ కల్యాణ మండపాల్లో అన్ని సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటిలో అర్హులందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారికి అన్యాయం జరగకుండా బాధ్యత వహించాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు సమాచారం అందించడంతో పాటు సేవలందించేలా అందుబా టులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు శైలజ, రఘు, తహసీలార్లు ఎం.గణపతి, చక్రవర్తి, సింగుపురం సర్పంచ్ ఆదిత్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

అరసవల్లి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఏ కాలనీలోని కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించి వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందివ్వరా?

● మండల సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్


వాదులాడుకుంటున్న టీడీపీ, వైసీపీ సభ్యులు

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రశ్నించారు. శుక్రవారం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా కూటమి ప్రభుత్వం యూరియా విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. దీనిపై వ్యవసాయాధికారి అజయ్‌కుమార్ స్పందించి మాట్లాడుతూ.. మండలంలో రైతులకు అవసరమైన 167 మెట్రిక్ టన్నుల యూరియా రాగా ఆర్ఎస్‌కేల ద్వారా అందించామన్నారు. అందరు రైతులకు యూరియా ఇస్తే రైతులు ఎందుకు రోడ్డెక్కు తున్నారని జడ్పీ చైర్‌పర్సన్ అధికారులను నిలదీశారు. కూటమి పార్టీలకు చెందిన రైతులకు మాత్రమే యూరియా ఇస్తున్నారని వైసీపీ ప్రజాప్రతినిధులు ఆరోపణలు చేయగా ఈ సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. కేంద్రమంత్రి చొరవతో పూర్తిస్థాయిలో యూరియా అందివ్వడం జరిగిందని టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు దక్కత ఏకాంబరి అన్నారు. తెచ్చిన యూరియా ఎక్కడ దాచారో చెప్పాలని ఎంపీటీసీ సభ్యులు ఆమెను ప్రశ్నించారు. ఈ విషయమై జడ్పీ చైర్‌పర్సన్‌ని ఏకాంబరి ఏకవచనంతో మాట్లా డుతూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని వాగ్వాదానికి దిగారు. జడ్పీ చైర్‌పర్సన్‌ను ఏకవ చనంతో సంబోధించడాన్ని సర్పంచ్ నర్తు ప్రసాద్ ఖండించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.వెంకట రావు, ఎంపీడీవో రామారావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రామాలకు తాగునీటిని అందించండి

కవిటి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన శుక్రవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు పి.కృష్ణారావు, పి.లక్ష్మణరావు, పి.నీలాచలం మాట్లాడుతూ.. ప్రజలకు సక్రమంగా తాగునీరందడం లేదన్నారు. బి.గొనపపుట్టుగ నీటిపథకం రెండు నెలలుగా మూతపడిందన్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు రావడం లేదన్నారు. ఉద్దానం పథకం సిబ్బందిని అకారణంగా తొలగించారని దాంతో గ్రామాల్లో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వంశీ, ఉద్దానం ఏఈ రమేష్ మాట్లాడుతూ.. కార్మికులను విధుల్లో తొలగించడం మా పరిధిలోనిది కాదని, గ్రామాలను పరిశీలించి నీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయమ్మ, ఎమ్మెల్సీ ఎన్.రామారావు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్, తహసీల్దార్ మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి నాయకులకే యూరియా..

రణస్థలం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ సానుభూతిపరులైన రైతులకు యూరియా ఇవ్వకుండా కూటమి నాయకులకే ఇస్తున్నారని జడ్పీటీసీ టొంపల సీతారాముడు, పలువురు సభ్యులు ఏవో విజయ్ భాస్కర్‌ను నిలదీశారు. ఎంపీపీ పిన్నింటి రజనీసాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. మండలంలో 5,144 ఎకరాల వరి, 2,700 మొక్కజొన్న సాగు చేయగా వీటికి అవసరమైన శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయ సేవా కేంద్రాల నుంచి 270 టన్నుల యూరియా, ప్రైవేటు డీలర్ల నుంచి 550 టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి విజయభాస్కర్ తెలిపారు. లోచర్లపాలేంలో అంగన్‌వాడీ కేంద్ర భవనం పనులు మధ్యలో నిలుపుదల చేశారని, శిథిలావస్థకు చేరిన భవనంలో ప్రస్తుతం కేంద్రం నిర్వహించడం వల్ల చిన్నారులు, గర్భిణులు, బాలింతలు భయాందోళన చెందుతున్నారని సభ్యుడు సింకు అప్పారావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వ్యవసాయ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

ఆమదాలవలస, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 15న గుంటూరు లామ్ ఫారంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ నీలవేణి ఒక ప్రకటనలో తెలిపారు. అంగ్రు అధికార వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు అసలు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు కూడా పదో తరగతి పాసై ఉంటే హాజరుకావచ్చన్నారు. తొగరాం వ్యవసాయ క్షేత్రంలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 77023 94824 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జానకి

కంచిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చిత్రలేఖనం పోటీలకు ఎంఎస్‌పల్లి మోడల్ కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆహూరి జానకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వమరవల్లి డైట్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి కళా ఉత్సవ్‌లో చిత్రలేఖనం పోటీలో పాల్గొని జానకి విజేతగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా జానకిని డిప్యూటీ డీఈవో విజయకుమారి బహుమతి అందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందించారు.

'ఎత్తిపోతల'కు విద్యుత్ సరఫరా


విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సిబ్బంది

గార రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గార వంశధార నదీ తీరంలో నిర్మించిన ఎత్తిపోతల పథకా నికి శుక్రవారం విద్యుత్ సరఫరా ఏర్పాటు చేశారు. 100 శాతం పనులు పూర్తి చేసుకున్నా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇప్పటి వరకు పథకం ప్రారంభించలేదు. ఎత్తిపోతలకు విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయడంపై నీటి సంఘం అధ్యక్షుడు సుగ్గు నాగరాజు, మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో ఎత్తిపోతల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయడంతో ఎత్తిపోతల పథకం వినియోగంలోకి తీసుకురావడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల సమీపంలో పారిశుధ్య లోపం


పాఠశాల సమీపంలో నిలువ ఉన్న మురుగు నీరు

జి.సిగడాం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగన్నాథవలస గ్రామ ప్రవేశంలో పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాఠశాల సమీపంలో సీసీ రహదారిపై వర్షపు నీరు నిలువ ఉండడంతో రోడ్డు పక్కన పెంట కుప్పలు, చెత్త చెదారాలతో దుర్గంధం వెదజల్లుతోంది. గ్రామంలోకి వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సీసీ రోడ్డుపై నిలిచిన నీటిలో నుంచే పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నమ్మండి.. ఇది రోడ్డే

గార, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం పంచాయతీ రాళ్లపేట రోడ్డు నుంచి దీపావళి రోడ్డులో ఇలా పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు దారుణంగా ఉంది. గోతుల్లో నీరు చేరి రోజుల తరబడి నిలిచి పోతుండడంతో తరచూ ప్రమా దాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ఏఈ సీహెచ్ మహంతి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.1.05 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

గోతులతో ఉన్న రోడ్డు



18న కలెక్టరేట్ వద్ద మహాధర్నా


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

సరుబుజ్జిలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో చేపడు తున్న బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా ఈనెల 18న కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం వెన్నెలవలసలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీ లకు కట్టబెట్టేందుకు పూనుకుంటోందన్నారు. అందులో భాగంగా అటు కార్గో ఎయిర్‌పోర్టు, ఇటు పవర్ ప్లాంట్ పేరుతో పెద్ద ఎత్తున భూములు ఆయా కంపెనీ లకు ధారాదత్తం చేసేందుకు సిద్ధపడుతోందని విమర్శించారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిం చాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షే మ పరిషత్ సంఘం అధ్యక్షుడు వాబ యోగి, రైతు కూలీ సంఘం అధ్యక్షుడు వంకల మాధవ రావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్‌రావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కంట అప్పలనాయుడు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయ కుడు అత్తులూరి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి


సురేష్ (ఫైల్)

కోటబొమ్మాళి/జలుమూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కిష్టుపురం గ్రామ సమీపంలో 33కేవీ విద్యుత్ లైన్‌కు తగిలిన చెట్టు కొమ్మలను తొలగించటానికి వచ్చిన జూనియర్ లైన్‌మన్ మామిడి సురేష్(28) శుక్రవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జలుమూరు మండలం పాగోడు గ్రామానికి చెందిన సురేష్ ఇదే మండలంలో టెక్కలిపాడు గ్రామ సచివాలయంలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కిష్టుపురంలో సిబ్బందితో కలిసి టెక్కలి నుంచి చల్లవానిపేట వైపు వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు వెళ్లాడు. సరఫరా నిలిపివేసి చేసి చెట్ల కొమ్మలు తొలగించారు. అనంతరం తిరిగి వెళ్లిపోతున్న సమయంలో పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లకు కమ్మకత్తి తగలడంతో ప్రమాదానికి గురై అకడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కోటబొమ్మాళి ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. కాగా సురేష్‌కి తల్లిదండ్రులు సరోజిని, రాజారావు, భార్య ఝాన్సీ కుమార్తె వర్షిణి (4), కుమారుడు ఉజ్వల్ (16 నెలలు) ఉన్నారు. కుటుంబాన్ని పోషించే ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. వీధిన పడిందని ఆ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని సర్పంచ్ దామ మన్మథరావు కోరారు.

అదుపుతప్పి కోళ్ల వ్యాన్ బోల్తా

టెక్కలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): టెక్కలి జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం కోళ్ల వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. పలాస నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఈ వ్యాన్ టెక్కలి సర్వీస్ రోడ్డు సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో అధిక సంఖ్యలో కోళ్లు మృతి చెందగా, డ్రైవర్, మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నోటీసులు జారీ చేయండి

జలుమూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్వమిత్వ సర్వేలో వెనుకబడిన తొమ్మిది పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయాలని డీఎల్‌పీవో గోపిబాల ఎంపీడీవోను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో స్వమిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వమిత్వ సర్వేపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శులు స్వమిత్వ సర్వేకు సంబంధిత సచివాలయ సర్వేయర్లు సహకరించడంలేదని డీఎల్పీవో దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు ఆయన తెలిపారు. అనంతరం అల్లాడ, సైరిగాం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో గోవిందరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోటబొమ్మాళి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో 'చిన్నారులతో మట్టిపని' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఎంఈవో డి.గోవిందరావు స్పందించి శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణతో మాట్లాడి చిన్నారులతో మట్టిని ఎందుకు మోయించారని ప్రశ్నించగా.. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటామని అందుకు విద్యార్థులు మట్టిని తీసుకువచ్చారని హెచ్‌ఎం సమాధానం ఇచ్చారు. అలాగే విద్యార్థులతో ఎంఈవో మాట్లాడుతూ మట్టి తేవడంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ


నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

మెళియాపుట్టి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాలను టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ఎరువులు విక్రయాలపై ఆరా తీశారు. ఇదే సమయంలో అక్కడున్న రైతులతో మాట్లాడి, ఎరువుల అందిన తీరుపై అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అన్ని చోట్ల సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎక్కడ రైతులకు ఇబ్బందులు రాకుండా అందివ్వడం జరుగుతుందన్నారు. ప్రైవేట్ డీలర్లు రైతులు వివరాలు ఉంచుకోవాలన్నారు. తహసీల్దార్ పి.పాపరావు, ఏడీ రామరావు ఉన్నారు.

పలాస ఆర్టీసీ డీఎంగా నాయుడు

పలాస, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పలాస ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎంఎస్ఎస్ నాయుడు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో విశాఖ రీజనల్ కార్యాలయంలో ఇంజనీర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో పనిచేసిన డిపోమేనేజర్ సీతారామ్ నాయుడు పదవీ విరమణ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ, జోనల్ అధ్యక్షులు పినకాన వాలీ, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, డిపో కమిటీ సభ్యులు, అధ్యక్ష, కార్యదర్శులు సన్మానించారు.

టెక్కలిలో రహదారి ఇక్కట్లు

- ఆక్రమణలకు గురవుతున్న పాత జాతీయ రహదారి
- పట్టించుకోని అధికారులు
- వాహనాల రాకపోకలకు ఇబ్బంది


రోడ్లపై నిలిచిన పాత వాహనాలు


రహదారిపైనే ఉన్న భవన నిర్మాణ సామగ్రి

టెక్కలి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి)! పాత జాతీయ రహదారిపై రోడ్డుకి ఇరువైపులా స్క్రాప్, మరమ్మతులకు గురైన వాహనాలు, బిల్డింగ్ మెటీరియల్స్ ఇతర వ్యర్థాలు ఉంచడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాస్తవానికి పాతజాతీయ రహదారి నాలుగులైన్ల రహదారి అయినా ఆ పరిస్థితి లేదు. నాలుగు రోడ్ల కూడలి నుంచి ఇందిరా గాంధీ కూడలి వరకు చూస్తే పరిస్థితి అర్థమవుతుంది. నియోజక వర్గ కేంద్రంలో రోడ్లు పరిశుభ్రంగా, రాకపోకలకు అనుకూలంగా ఉండాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పదేపదే చెబుతున్నా.. ఇటు పోలీసులు గాని, అటు పంచాయతీ అధికారులు గాని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నాలుగు లైన్ రహదారిలో అటు ఇటు ఒక్కో లైన్ ఆక్రమించేశారు. దీంతో జాతీయ రహదారి రూపు లేఖలే లేకుండా పోయింది. కొందరు మెకానిక్‌లు ఏకంగా రోడ్లపైనే వాహనాలను నిలిపివేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి ఆక్రమణలను తొలగించాలని మేజర్ పంచాయతీ ప్రజలు కోరుతున్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలోని మారు మూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం హంసరాలి వద్ద జల్‌జీవన్ పథకంలో భాగంగా రూ.58.30లక్షలతో, శాసనం గ్రామంలో రూ.92.40 లక్షల నిర్మించనున్న తాగునీటి ప్రాజెక్టు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. దీంతోపాటు మందూరు గ్రామంలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం సిరిపురం గ్రామంలో దేవదాయశాఖ ఆలయ పరిధిలోని కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొని మాట్లాడారు. దసరా ఉత్సవాలకు ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన, నాయకులు పీరుకట్ల విఠల్, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, తమిరి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

- పలాస రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): తర్లాకోట గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.58.40 లక్షలతో తాగునీటి ప్రాజెక్టు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, పార్టీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్, పీఏసీఎస్ చైర్మన్ వంకల కూర్మారావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, దువ్వాడ సంతోష్, కుమారరాజా పాల్గొన్నారు.

అర్హత ప్రాతిపదికన ప్రభుత్వ సేవలు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అర్హత ప్రాతిపదికగా ప్రభుత్వ సేవలు అందుతాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. కాగువాడ గ్రామానికి చెందిన లబ్ధిదారురాలు అగ్గూరి ఉషా కుమారికి రూ.2లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఉషాకుమారి భర్త అగ్గూరు కేశవరావు ఇటీవల ప్రమాదానికిగురై మృతిచెందగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులకులోనై ఆ కుటుంబం ఎమ్మెల్యేను ఆశ్రయించింది. దీంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.2లక్షలు ఎమ్మెల్యే మంజూరు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పైల బాబ్జీ, మడ్డు రామారావు, శివాల చిన్నయ్య, నల్లి జగదీశ్వరరావు తదితరులు ఉన్నారు.

అధిక యూరియా వాడడం వల్లే కొరత

- మండల సమావేశంలో ఏడీఏ జగన్మోహనరావు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అధిక స్థాయిలో యూరియా వాడడం వల్లే కొరత ఏర్పడిందని టెక్కలి ఏడీఏ జగన్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎంపీపీ రోణంకి ఉమ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎరువుల కొరతపై ఏడీఏ సభ్యులకు వివరించారు. వరి సాగులో ఎకరా పొలానికి తొలివిడతగా 25 కిలోలు మాత్రమే వేయాలని.. ఇలా మూడు విడతల్లో మొత్తం 75 కిలోలు సరిపోతుందన్నారు. ప్రస్తుతం రైతులు దీని రెండింతలు వినియోగిస్తున్నారని వివరించారు. అందువల్లే ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. యూరియా, భూ ఆక్రమణలపై అధికారులను వైసీపీ నాయకులు ప్రశ్నించడంతో సౌడాం గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన ఎంపీటీసీ పట్ట సింహాచలం వైసీపీ హయాంలో జరిగిన ఆక్రమణలు, రైతుల ఇబ్బందులు జరగలేదని ఎదురుగా మాట్లాడటంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఎంపీడీవో సభ్యులుపై కోపగించడంతో ఎక్కడ వాళ్లు అక్కడ కూర్చున్నారు. ఇక నుంచి సర్వసభ్య సమావేశానికి సభ్యులు మాత్రమే హాజరు కావాలని, ప్రతినిధులు హాజరైతే సమావేశ మందిరంలోకి అనుమతించేది లేదని ఎంపీడీవో స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో నారాయణ రావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, అన్నిశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



హిరమండలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం హి రమండలంలో పాత గ్రామీణ బ్యాంకు భవనం ఎ దురుగా ఏడీ రోడ్డుపై గుంతలు పడి ప్రమాదరకంగా మారాయి. వాహనచోదకులు ఇబ్బం దిపడుతున్నారు. ఇప్పటికైనా ఈ గోతులు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

జాతీయ సమైక్యతకు ప్రతీక హిందీ

పోలాకి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతకు ప్రతీకగా నిలచిన హిందీ భాషపై విద్యార్థులు మక్కువ చూపాలని కోడూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జి.శాంతి అన్నారు. శుక్రవారం ఉన్నత పాఠశాలలో హిందీ దివస్‌ను పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రాథమిక దశ నుండే హిందీ పరీక్షలు రాసి హిందీభాషపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలన్నారు. 14వ తేదీన హిందీభాష ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన ఆట, పాట, క్విజ్ పోటీల్లో విజేతలకు ప్రధానోపాధ్యాయులు, హిందీపండితులు రాజేశ్వరరావు, హేమలత, ఉపాధ్యాయ సిబ్బంది బహుమతులు అందజేశారు.

కూరగాయల సాగుతో అధిక లాభాలు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతుల్లో కూరగాయలు సాగుచేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కాపుగోదాలయవలసలో నెట్ కల్చర్ ద్వారా సాగవుతున్న కూరగాయల పెంపకంపై జిల్లా రైతులతో కలిసి సందర్శించారు. షేర్ నెట్ విధానంలో సాగు బాగుంటుందని, ఇందుకోసం 50శాతం సబ్సిడీ పొందవచ్చునన్నారు. జిల్లాలోని 11మండలాల నుంచి రైతులను తీసుకువచ్చి కాపుగోదాయవలసలో రైతు రామారావు నెట్ విధానంలో సాగుచేస్తున్న కూరగాయల పంటలు చూపించి వారికి అవగాహన కల్పించారు. హార్టికల్చర్ జేడీ చంద్రశేఖర్, డీపీఎం నారాయణరావు, ఏపీఎం శ్రీనివాసరావు, సీసీ వరదరాజు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పంగ భానుమతి, కుత్తుమ శివప్రసాద్ పాల్గొన్నారు.

కీర్తిచక్ర రామ్‌గోపాల్‌ని అభినందించిన మెగాస్టార్


చిరంజీవితో రామ్‌గోపాలనాయుడు దంపతులు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగిరిపెంట గ్రామానికి చెందిన కీర్తిచక్ర అవార్డు గ్రహీత మల్ల రామ్‌గోపాల నాయుడును మెగాస్టార్ చిరంజీవి అభినందించారు. శుక్రవారం రామ్‌గోపాలనాయుడు దంపతులు మెగాస్టార్ చిరంజీవిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జమ్మూలో ఉగ్రవాదులను కాల్చివేయడంతోపాటు తోటి సైనికులు రక్షించడంలో రామ్‌గోపాల్ చూపిన ధైర్యసాహసాలు దేశానికే గర్వకారంగా నిలుస్తాయన్నారు. దేశ రక్షణ రంగంలో అత్యుత్తమ కీర్తిచక్ర అవార్డు పొందడం అభినందనీయమన్నారు.

వీరచక్ర అవార్డు గ్రహీతకు నగదు ప్రోత్సాహకం


ప్రవీణ్‌కుమార్

హిరమండలం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): దేశ మూడో అత్యున్నత సైనిక పురస్కారం వీరచక్ర దక్కించుకున్న చొర్లంగి గ్రామానికి చెందిన సి.ప్రవీణ్‌కుమార్‌కు రాష్ట్రప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేసి ప్రోత్సహించింది. ఈ మేరకు జనరల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రవీణ్ 2020లో రిపబ్లిక్‌డే సందర్భంగా సేనా మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ ప్రతిపాదికన రాష్ట్ర ప్రభుత్వం నగదు బహుమతి మంజూరు చేసింది. ఇతని తల్లిదండ్రులు చీమలపాటి సుబ్బారావు, స్వరూపరాణి చొర్లంగి గ్రామంలో నివాసం ఉంటున్నారు. తండ్రి వ్యవసాయం చేస్తుంటారు. ప్రవీణ్‌కుమారు 6వ తరగతి నుంచి కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యాభసం చేశారు.

ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

టెక్కలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లాలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 24గంటల హేక్తాన్ పోటీల్లో కె.కొత్తూరు దరి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. స్మార్ట్ ఎగ్రికల్చర్, డోషైనా అనే పరిశోధనతో విద్యార్థులు దుర్గా పవన్‌కుమార్, శ్రీని వాస్, అఖిలేష్, ఆశ్రిత్ బృందం ప్రథమస్థానంలో నిలిచారని డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. రూ.20వేలు బహుమతిని అందుకున్నట్టు తెలిపారు. విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ రమేష్ అభినందించారు.

డిగ్రీ కళాశాల ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయి గుర్తింపు

పలాస, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రేరణ మిత్ర పైలట్ ప్రాజెక్టు కు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పలాసలో 2024-25 విద్యా సంవత్సరంలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో విద్యార్థుల గుర్తింపునకు యూనిసెఫ్ వారు రాష్ట్రస్థాయిలో ప్రేరణ మిత్ర పైలట్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన 30మంది విద్యార్థులకు శుక్రవారం కళాశాలలో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ గణపతిరావు, శిక్షణఫౌండేషన్ సభ్యులు, కోఆర్డినేటర్ ఆర్.దీపకుమారి, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

16న మండల సమావేశం

టెక్కలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారులంతా పూర్తి సమాచారంతో రావాలని, ప్రజా ప్రతినిధులంతా హాజరు కావాలని కోరారు.

29న సొసైటీ మహాజన సభ

పోలాకి సెప్టెంబర్ 12(ఆంధ్రజ్యోతి): పోలాకి పీఏసీఎస్ పాలక సభ్యుల మహాజన సభ ఈ నెల 29వ తేదీన నిర్వహిస్తున్నట్టు సొసైటీ అధ్యక్షుడు బైరిబాస్కరరావు, సీఈవో రాంబాబు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, రైతులు విధిగా హాజరుకావాలని కోరారు. రైతులు రుణాలను రెన్యువల్ చేయించుకోవాలని లేకుంటే వడ్డీ అదనంగా వసూలు చేస్తారన్నారు. కొత్త రుణాల కోసం కార్యాలయాన్ని సంప్రదించాలని సీఈఓ సూచించారు.

నేడు ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభం

హిరమండలం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): హిరమండలం వద్ద జరుగుతున్న ఉద్దానం రెండో దశ తాగునీటి పథకం పనులకు శనివారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించనున్నారని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు చెప్పారు. స్థానిక బ్యారేజి సెంటర్‌లో ఉదయం 11 గంటలకు జరగనున్నట ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరకావాలని కోరారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం

వజ్రపుకొత్తూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మంచినీళ్లపేట గ్రామంలో శుక్రవారం ప్రధానమంత్రి మత్స్యయోజన పథకంలో భాగంగా 27మందికి ట్రాన్స్ పాండరులు, 21మందికి రూ.17.13లక్షల విలువ చేసే వలలు, ఇంజన్లు అందజేశారు. కార్యక్రమంలో గుళ్ల చిన్నారావు, పాపారావు, పుచ్చ ఈశ్వర్రావు, కోనారి కిరన్, రామారావు, సూర్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలే కారణం

టెక్కలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సామాజిక కారణాలతో పాటు మానసిక రుగ్మతలు కూడా ఆత్మహత్యలకు ప్రధాన కారణమని రిమ్స్ వైద్యులు గోపీచంద్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 15 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల విద్యార్థులు అనేక మానసిక సమస్యలకు గురవుతుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుపతిరావు, ఏఆర్‌టీ కౌన్సిలర్ పైల నేతాజీ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

పాతపట్నం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా బోధన సాగాలని సాంఘిక సంక్షేమ గురుకులాల జిల్లా సమన్వయాధికారిణి జి.గ్రేస్ అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమపాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఒత్తిడి లేని బోధన చేపట్టాలన్నారు. పరిసరాలతోపాటు వంటలు, బోధన పరిశీలించారు. కాలాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని, స్వీయక్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థినిలకు సూచించారు. ప్రిన్సిపాల్ పి.పద్మావతి, ఉపాధ్యాయ, సిబ్బంది ఉన్నారు.

నిధులు వినియోగించుకోవాలి

నరసన్నపేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అభివృద్ధికి 15 ఆర్థిక సంఘ నిధులతోపాటు జనరల్ ఫండ్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఆరంగి మురళీధర్ సూచించారు. శుక్రవారం మండల సర్వసభ సాధారణ సమావేశం నిర్వహించారు. ప్రతీ రైతుకు యూరియా అందించాలని, యూరియా పంపిణీలో ఏకపక్ష ధోరణి వీడనాడాలని సభ్యులు చలపతిరావు, శేఖరరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండల పరిషత్ తీర్మానం లేకుండా అన్న క్యాంటీన్ నిర్మాణం చేయడం తగదని, తాము నిర్మాణానికి వ్యతిరేకం కాదన్నారు. అయితే తీర్మానం లేకుండా భవనం నిర్మాణం చేస్తే ధర్నా చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయానంద్, ఏవో సూర్యకుమారి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫలితాల సాధనలో తోడ్పడాలి

నందిగాం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తల్లిదండ్రులు తోడ్పాటు అవసరమని మండలం లఖిదాసుపురం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల ప్రగతిని కె.దాలయ్య చదివి వినిపించారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని విద్యలో ప్రోత్సహించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకువచ్చేలా చూడాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఎఫ్ఏ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందించారు.

రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



కాశీబుగ్గకు చేరిన రాజ్యాంగం పరిరక్షణ యాత్ర

కంచిలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు, క్రిమీలేయర్ విధానానికి వ్యతిరేకంగా చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర శుక్రవారం కంచిలిలో కొనసాగింది. యాత్ర నిర్వాహకుడు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.అశోక్‌బాబు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు చెన్న కేశవులు కంచిలిలోని వీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు నూతలపాటి బాబూరావు, నగిరి మోహనరావు, డి.వెంకటరావు, జి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

- కాశీబుగ్గ, సెపెంబరు 12(ఆంధ్రజ్యోతి): దళితులు పాలక పక్షంగా మారితేనే తమ హక్కుల కాపాడుకోగలరని, రాజ్యాంగం వ్యతిరేక వర్గీకరణను రద్దు చేయాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.అశోక్‌బాబు, పబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండి యా స్థాపకులు దాసరి చెన్నకేశవులు అన్నారు. రాజ్యాంగం పరిరక్షణ యాత్రలో భాగంగా కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు తలపెట్టిన యాత్ర శుక్రవారం పలాస చేరుకొని, కాశీబుగ్గ బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణారావు, పాపారావు, శంకర్, పద్మలోచన్, జీవన్‌బాబు, దుర్యోదనరావు, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- టెక్కలి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా రా జ్యాంగ పరిరక్షణ, మాలల ఆత్మీయ పాదయాత్రను శుక్రవారం టెక్కలిలో నిర్వహించారు. ఇందిరాగాంధీ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కొనసాగుతుందని ఆ సంఘ అధ్యక్షుడు అశోక్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో దాసరి చెన్నకేశవులు, చల్లా రామారావు, బాబూరావు, ధనుంజయరావు, డీపీ స్టాలిన్, కామేశ్వరరావు, గడ్డయ్య, సుంకు గోపీనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- ఇచ్ఛాపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించి మాలలకు అన్యాయం చేసిన సీఎం చంద్రబాబుకు గుణపాఠం చెప్పాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర డైరెక్టర్ చెన్న కేశవులు అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో భాగంగా కుప్పం నుంచి ప్రారంభించిన పాదయాత్ర శుక్రవారం ఇచ్ఛాపురంలో కొనసాగింది. కార్యక్రమంలో ఆ సంఘాల నేతలు సల్ల దేవరాజ్, ఎన్.బాబూరావు, ఎస్.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రణభేరి విజయంతం చేయాలి

హరిపురం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 15న యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టబోయే రణభేరి కార్యక్రమాన్ని ఉపాధ్యాయ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. మందస మండలం బీఎస్ పురం, సొండిపూడి, జీఆర్‌పురం, మందస, హరిపురం ఉన్నత పాఠశాలలను ఆయన సంఘ సభ్యులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా సెప్టంబరు 25న విజయవాడలో నిర్వహించే భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనికిగాను ఆయా పాఠశాలల వద్ద గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గుంట కోదండరావు, తేజేశ్వరరావు, రమణబాబు హెచ్‌ఎంలు గోపీచంద్, రమణమూర్తి, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ పాణిగ్రహి, మల్లిఖార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

సంతబొమ్మాళి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సర్వాపురం పంచాయతీ ఆకులసతివానిపేటలో బోన్ మారో డిప్రెషన్ వ్యాధితో బాధపడుతున్న ఇచ్ఛాపురం యోగికి వల్లేవలస మన బడి అసోసియేషన్ పదివేల రుపాయిల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. మన బడి అసోసియేషన్ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న పాల్గొన్నారు.

కోతకు గురైన కడపలగెడ్డ రోడ్డు

- రాకపోకలకు అవస్థలు



కోతకుగురైన చోట బురదలో దిగబడిపోయిన వ్యాన్

ఎల్ఎన్ పేట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తురకపేట, దబ్బపాడు గ్రామాల మధ్య కడపలగెడ్డపై బ్రిడ్జి నిర్మించేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎమ్మెల్యే మామిడి. గోవింద రావు శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో దబ్బపాడు గ్రామస్థులతోపాటు ఈ రోడ్డుగుండా ప్రయాణించే ప్రయాణికుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు కాంట్రాక్టరు పక్కనుంచి ప్రత్యామ్నాయంగా గ్రావెల్‌తో రోడ్డు సౌకర్యాన్ని కల్పించారు. బ్రిడ్జి నిర్మాణపు పనులు జరుగుతున్న సమయంలో వర్షాకాలం ప్రారంభం కావడంతో జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు రాకపోకలకు ఆటంకంలేకుండా వేసిన రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడంతో బిడ్జి పనులు నిలిచిపోవడమే కాకుండా రోడ్డు పూర్తిగా కోతకుగురైంది. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా వీలులేకుండా పోయింది. రోడ్డుపై నుంచి నీరు ప్రవహించడం తగ్గిపోవడతో ద్విచక్ర వాహనదారులు రోడ్డుదాటినంతవరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు రాకపోకలు జరుగుతుండడంతో ఆటోలు, ట్రాక్టర్లు, వ్యాన్లు నడిపే వాహన చోదకులు రాకపోకలు జరుపుకునేందుకు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. రోడ్డుపైనుండి నీరుప్రవహించినందున వాహనాలు రోడ్డుదాటిన సమయంలో మట్టిలోకి కూరుకుపోతున్నాయి. దీంతో కూరుకుపోయిన వాహనాన్ని బయటకు తీసేందుకు ఎన్నో ఇబ్బందులు పడవలసి వస్తుందని పలువురు వాహనచోదకు విచారం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టరు, ఆర్అండ్‌బి అధికారులు రోడ్డు పనులుచేపట్టి పక్కా రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.